క్లుప్తంగా

శ్రమిస్తేనే జీవితంలో రాణింపు



సిరిసిల్లకల్చరల్: జీవితంలో శ్రమిస్తేనే రాణిస్తారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ అన్నారు. సోమవారం నిత్య జాతీయ పతాకావిష్కరణలో భాగంగా ఇంటర్ లో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించిన కళాశాల విద్యార్థి కోమాకుల శశికుమార్, అతని తల్లి లతతో జాతీయ పతాకాన్ని ఆవిష్కరింపజేశారు. విద్యార్థులు సమయాన్ని, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి జీవితంలో సక్సెస్ సాధించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు సామల వివేకానంద్, శ్రీనివాసరావు, అరుంధతి, కనకయ్య, చంద్రమౌళి, రాజయ్య, ఆంజనేయులు, భరత్, సరోజ, విజయ, చంద్రశేఖర్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖగోళ యాత్రికుడికి వినూత్న స్వాగతం



గంభీరావుపేట: దేశం నుంచి అంతరిక్షానికి వెళ్లిన రెండో ఖగోళ యాత్రికుడు శుభాంశు శుక్లా తిరిగి వచ్చిన సందర్భంగా మండలంలోని దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం వినూత్న స్వాగతం పలికారు. అంతరిక్షానికి సంబంధించిన అంశాలను పాఠశాల మైదానంలో రంగవల్లులతో నింపారు. కాగితాలతో తయారు చేసిన గ్లోబ్‌లు రూపొందించి రూపొందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానం, దేశభక్తి, శాస్త్రీయ ఆవిష్కరణలపై ఆసక్తి కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు నారాయణ, సైన్స్ టీచర్ సంపత్ కుమార్‌లు అన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్: డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులను కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు అన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు రక్షణ కల్పించాలని సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మూడేళ్ల క్రితం ముస్తాబాద్‌లో అర్హులైన పేదలను గుర్తించి, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తే వాటిని రద్దు చేస్తామని పలువురిని బెదిరించడం సరికాదన్నారు. క్యాన్సర్‌తో మృతిచెందిన లబ్ధిదారురాలి కుమారుడిని డబుల్‌బెడ్‌రూమ్ ఇంటిని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారన్నారు. పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, బాలయ్య, మెంగని మనోహర్, భరత్, స్వామి, సత్యం, రాజు, జహంగీర్, బాలయ్య తదితరులున్నారు.

రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సభ్యుడిగా మల్లారెడ్డి



చందుర్తి: రాష్ట్ర కబడ్డీ అసోషియేషన్ సభ్యుడిగా మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన ముష్కు మల్లారెడ్డిని ఎంపికచేశారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ కబడ్డీ అసోషియేషన్ సమావేశంలో జిల్లాకు చెందిన ముష్కు మల్లారెడ్డిని సభ్యుడిగా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేశ్, కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి మల్లారెడ్డిని అభినందించారు.

ఈత చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఈత చెట్లను పరిశీలిస్తున్న గీత కార్మికులు

కోనరావుపేట: ధర్మారంలో ఈత చెట్లు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ధర్మారంకు చెందిన రాజయ్య భూమిలో ఉన్న ఆరు ఈత చెట్లను నరికివేశారన్నారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడ: మేడిపల్లి మండలం కొండాపూర్ మాజీ ఉప సర్పంచ్ జంగిలి విజయ్‌నరేశ్ తోపాటు గ్రామ నాయకులు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అసంపూర్తిగా సీసీరోడ్డు

- బురదమయంగా చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు
- ఏడాది క్రితం సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు
- రైతుల వివాదంతో నిలిచిన పనులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



సగంలో నిలిచిపోయిన సీసీరోడ్డు నిర్మాణం

చందుర్తి: చిన్నపాటి వర్షంపడినా దారి పొడవునా బురదలో కళాశాలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఏడాది దగ్గర పడుతున్నా రోడ్డుకిరువైపులా రైతుల వివాదంతో పనులకు బ్రేక్ పడింది. ఈ విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ జోక్యం చేసుకుని ఇద్దరి రైతుల మధ్య ఉన్న సమస్యకు పరిష్కారం చూపితే, మళ్లీ ఓ రైతుకు పోలీసుల పంచాయతీ నచ్చలేదని పనులను అడ్డుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

దారి కష్టాలు తప్పేదెప్పుడో ?

మండలకేంద్రం శివారులోని కాకుల గుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల దారి సక్రమంగా లేదని 2024 ఆగస్టు 10న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కలిసి రూ.25లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాగా పనులను మేలో ప్రారంభించి సగానికి పైగా సీసీరోడ్డు వేశారు. మిగిలిన 150 మీటర్ల రోడ్డు పనులను చేయకుండా దారికి ఇరువైపులా ఉన్న రైతులు రోడ్డు నిర్మాణంలో తమ భూమి ఎక్కువగా పోతుందని సీసీరోడ్డు పనులను అడ్డుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దారి పంచాయతీ కావడంతో సీఐ వెంకటేశ్వర్లు నిలిచిపోయిన రోడ్డు వద్దకు వెళ్లి వివాదానికి కారణమైన ఇద్దరు రైతులతో మాట్లాడి సమస్యను కొలిక్కి తీసుకొచ్చారు. విన్నట్టే విని ఓ రైతు తమకు పంచాయతీ నచ్చలేదని పనులు అడ్డుకున్నారు. దీంతో నెలరోజులుగా సీసీరోడ్డు పనులు జరగక, వర్షంపడితే విద్యార్థులకు బురదదారిలోంచి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

కళాశాలకు నిధులు మంజూరు

చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభించి ఏడేళ్లు గడుస్తున్నా సరైన సదుపాయాలు లేక ఇబ్బంది పడుతుండగా విద్యార్థుల కష్టాలు ఒక్కొక్కటిగా తీరనున్నాయి. సీసీరోడ్డు నిర్మాణం పూర్తయితే రోడ్డు సమస్యకు పరిష్కారం లభించినట్లే. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చందుర్తి కళాశాలకు రూ.18.47లక్షలు మంజూరైనట్లు ప్రకటించారు. ఈ నిధులతో కళాశాలకు ప్రహరీ, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్, చిన్నపాటి సమస్యలు పరిష్కారమైతే ఇబ్బందులు తీరుతాయని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు. మంజూరైనా నిధులతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు.

పెరుగుతున్న ప్రవేశాలు

కళాశాలలో చిన్న సమస్యలు తప్ప, ఇబ్బందులు లేకపోవడంతో మండలంలోని పలు గ్రామాల విద్యార్థుల చందుర్తి ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు ఆసక్తిని కనబర్చుతున్నారు. గతేడాది విద్యా సంవత్సరంలో 200లోపే ఉన్న విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది 40 మందికి పైగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిగులు పనులు పూర్తిచేయించాలి



చిన్నపాటి వర్షం పడినా కళాశాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 150 మీటర్ల సీసీరోడ్డు పనులు రైతుల హద్దులతో నిలిచిపోయాయి. అధికారులు జోక్యం చేసుకొని మిగులు పనులు పూర్తి చేయించాలి.

– చింతం లావణ్య, ఎంపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని

ప్రహరీ నిర్మించాలి



కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు వస్తున్నాయి. కళాశాల చుట్టూ పక్కల వ్యవసాయ క్షేత్రాలు ఉండడంతో కళాశాల మైదానంలోకి పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. వెంటనే కళాశాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

– దొంతుల స్పందన, ఎంపీసీ, విద్యార్థిని

మూలవాగుపై వంతెనలు నిర్మించాలి



మూలవాగు వంతెనను పరిశీలిస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని మూలవాగుపై వంతెనలు నిర్మించాలని బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ కోరారు. మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల గ్రామాల్లోని మూలవాగును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలవాగుపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. నాయకులు స్పందించి మూలవాగుపై వంతెనల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు ఎడ్ల సుధాకర్, జెట్టి విజయ్, గుండ శ్రీకాంత్, బొంగు రవి, జెట్టి హన్మాండ్లు, దాదె జలపతి, కాసర్ల వేణు తదితరులున్నారు.

ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలి



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆత్మీయ సన్మాన సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు సభకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 16న హైదరాబాద్‌లోని హబ్సిగూడలో మాదిగ హక్కుల దండోరా, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే సభకు నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూడెల్లి ప్రవీణ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మండల అధ్యక్షుడు హమీద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



వీర్నపల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యంతో చదవాలని ప్రముఖ సీఐడీ ఎస్పీ (నార్కోటిక్స్ హైదరాబాద్) భూక్యా రాంరెడ్డి నాయక్ అన్నారు. సోమవారం ధూమానాయక్ ట్రస్ట్ ద్వారా గర్జనపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్ట్, డైరీలు అందజేశారు. విద్యార్థులు చిన్నప్పటి కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్లు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ట్రస్ట్ చైర్మెన్ విజయ మాట్లాడుతూ... చదువుకునే వారికి తమ ట్రస్ట్ ద్వారా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కేవలం విద్యాభివృద్ధికే తాము ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, గజన్, కావేరి, దేవేందర్, గ్రామ కార్యదర్శులు ప్రవీణ్, సుష్మా, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్లు రాకేశ్‌గౌడ్, నవీన్ నాయక్, మాజీ సర్పంచులు రవినాయక్, శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్. పద్మావతిని నియమిస్తూ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ కమిషనర్ కృష్ణ ఆదిత్య సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. పద్మావతి మంగళవారం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కొంతకాలంగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన వనజకుమారి సిరిసిల్ల బాలికల కళాశాలకు బదిలీపై వెళ్లారు.పద్మావతిని రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా నియమించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఎస్సై వేముల లక్ష్మణ్

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి బస్టాండ్ ఆవరణలో ఎస్సై వేముల లక్ష్మణ్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. చిన్నారులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు వారిపై పిల్లలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే 1930 కాల్ చేయాలన్నారు. మద్యంతాగి వాహనాలు నడపవద్దని సూచించారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో రామలక్ష్మణపల్లె మానేరు వాగు ఒడ్డున నిర్మిస్తున్న శ్రీ మడేలయ్య స్వామి ఆలయ నిర్మాణ పనులను సోమవారం నాయకులు పరిశీలించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలనుకున్నట్లు నాయకులు తెలిపారు. రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు కంచర్ల పర్శరాములు, బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు కంచర్ల రాజు, నాయకులు వెంకటేష్, మల్లారెడ్డి, రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• రూ. 2వేలకే ఇసుక అందించాలి

సిరిసిల్ల అర్బన్ : పట్టణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.2 వేల ట్రిప్పు ఇసుక అందించాలని బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందిస్తామని ప్రభుత్వం చెప్పినా ట్రాక్టర్ యజమానులు ఒక్కో ట్రిప్పుకు రూ.5వేల వరకు తీసుకుంటున్నారన్నారు. అధికారులు చొరవ తీసుకొని ట్రాక్టర్ యజమానులతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.2 వేలకే ట్రిప్పు ఇసుక అందించాలని ఆయన కోరారు.

• నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలి

గంభీరావుపేట: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు దోమకొండ కృష్ణకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన యాదవుల సమావేశంలో మాట్లాడారు. గొర్రెలు, మేకలకు ఏడాదిలో నాలుగుసార్లు నట్టల నివారణ మందులు ఇవ్వాల్సి ఉంటుందని, ప్రభుత్వం రెండేళ్లుగా పంపిణీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం మందులు సరఫరా చేయకపోవడంతో యాదవులు ప్రైవేట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

• ర్యాలీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ అమలుచేస్తుండగా జిల్లా కేంద్రంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు.

• నూతన కమిటీ ఎన్నిక

ముస్తాబాద్: ముస్తాబాద్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం పేరెంట్స్ కమిటీ ఎన్నికలను సోమవారం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా జి.పవన్, వైస్‌చైర్మన్‌గా ఎ.రఘుపతి, ప్రధాన కార్యదర్శిగా కె.రమేష్, సంయుక్త కార్యదర్శిగా యాదమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.నర్సింలు, కోశాధికారిగా ఎ.దేవరాజు, సభ్యులుగా నిషా, లత, శేఖర్, ప్రభాకర్, సరోజ, విజయ్, రాజు, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్ అభినందించారు.

• గొర్రెలు అపహరించిన వ్యక్తులను పట్టుకోవాలి

బోయినపల్లి: కొదురుపాకలో గొర్రెలు ఎత్తుకెళ్లిన వారిని పట్టుకోవాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొక్కు దేవేందర్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కొదురుపాకలో బాధితులతో మాట్లాడి చోరీ సంఘటన వివరాలు తెలుసుకున్నారు. స్థానిక పోలీసులతో మాట్లాడి వెంటనే చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకోవాలని కోరారు. కొదురుపాకకు చెందిన పెంజర్ల తిరుపతికి చెందిన 21 గొర్రెలు, మల్యాల బాలయ్యకు చెందిన 10, ఎల్లయ్యకు చెందిన ఏడు గొర్రెలు దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై పోలీసులు వెంటనే స్పందించి నిందితులను పట్టుకోవాలని యాదవులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర నాయకులు మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

• బాధితురాలికి న్యాయం చేయాలి

సిరిసిల్ల అర్బన్ : అదనపు కట్నంకోసం ఇబ్బంది పెడుతుండగా బాధితురాలికి న్యాయం జరిగేవరకు పోరాడుతామని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జవ్వాజి విమలక్క డిమాండ్ చేశారు. చిన్నబోనాలలో పర్శరాములు ఇంటి ముందు బాధితురాలికి మద్దతుగా మహిళలు నిరసన తెలిపారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కీర్తన అనే అమ్మాయిని చిన్నబోనాల గ్రామానికి చెందిన పర్శరాములుకు ఇచ్చి వివాహం జరిపించారని, అదనపు కట్నం కోసమని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. మహిళలు లక్ష్మి, రేణుక, లత, మమత తదితరులు పాల్గొన్నారు.

• వ్యక్తి అదృశ్యం

ముస్తాబాద్: మండలంలోని గోపాల్‌పల్లెకు చెందిన బోదాసు ఎల్లం (40) అదృశ్యమైనట్లు ఎస్సై గణేశ్ సోమవారం తెలిపారు. గతనెల 19న ఎల్లం ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఎల్లం భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

• రెండు బైక్‌లు ఢీ..

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రం శివారులోని పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్‌కు చెందిన సూర బాలయ్య తన బైక్‌పై వెళ్తూ పెట్రోల్ బంక్ దగ్గర యూటర్న్ చేస్తున్నాడు. అదే సమయంలో రాచర్ల గొల్లపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు బైక్‌పై వస్తున్న వ్యక్తి అతివేగంగా బాలయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, నివాసాల మధ్య గడ్డి పేరుకుపోయింది. దీంతో దోమలు వృద్ధి చెంది కాలనీవాసులు రోగాలబారినపడుతున్నారు. అలాగే పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గడ్డిని తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
జాఫర్, కార్యదర్శి, నారాయణపూర్ : సెల్ : 9640832448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పద్మశాలీ సంఘం ఎన్నికలు కొందరికేనా!

- 27న ఎన్నికలు
- అధిక ఫీజుపై విమర్శలు
- నిబంధనలు సడలించాలని డిమాండ్

నోటిఫికేషన్	జూలై 13
నామినేషన్ల స్వీకరణ	జూలై 19, 20
నామినేషన్ల ఉపసంహరణ	జూలై 21
గుర్తుల కేటాయింపు	జూలై 22
ఎన్నికలు	జూలై 27, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2
ఓట్ల లెక్కింపు, ఫలితాలు	జూలై 27, సాయంత్రం 4 గంటలకు

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీ సంఘం ఎన్నికలకు సోమవారం నగార మోగింది. జిల్లా కేంద్రంలో అత్యధిక జనాభా ఉన్న సామాజికవర్గం కావడంతో ఈ ఎన్నికలు హాట్‌హాట్‌గా మారనున్నాయి. 9,600 మంది సభ్యులుగా ఉన్న సంఘానికి ఈనెల 27న పోలింగ్ నిర్వహించి, అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు. అధ్యక్ష స్థానంపై కన్నేసిన నాయకులు ఇప్పటికే వారి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే ఎన్నికల బరిలో నిలిచేందుకు అభ్యర్థులు చెల్లించాల్సిన ఫీజు ఎక్కువగా ఉండడంపై స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. సామాన్యులకు అందనంత ఎక్కువగా ఉందనే చర్చ సాగుతోంది. అధ్యక్ష స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.50వేలు, ఉపాధ్యక్ష స్థానానికి రూ.30వేలు, ప్రధాన కార్యదర్శి స్థానానికి రూ.40వేలు, కోశాధికారి, సహాయ కార్యదర్శి పోస్టులకు రూ.30వేలు, డైరెక్టర్(ఒక్కో వార్డుకు ఒక్కో డైరెక్టర్) పోస్టుకు రూ.15వేలే డిపాజిట్ సొమ్ముగా నిర్ణయించారు. ఈ ఫీజు తగ్గించాలనే చర్చ జోరుగా సాగుతోంది.

హామీలను ప్రభుత్వం అమలుచేయాలి



ఎల్లారెడ్డిపేట : మాట్లాడుతున్న లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట: దివ్యాంగుల పింఛన్ల పెంపుదలకు ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, వెంటనే హామీని అమలుచేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలంలోని దుమాల, గొల్లపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో సోమవారం దివ్యాంగులతో సమావేశాలు నిర్వహించారు. పెన్షన్లు పెంచేవరకు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో పోరాటం చేస్తామన్నారు. ఈనెల 27న జిల్లాకేంద్రంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో దివ్యాంగుల మహాగర్జన సభ ఉంటుందన్నారు. జిల్లాలోని దివ్యాంగులు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు గోపి, సంజీవ్, రాజిరెడ్డి, మల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో వికలాంగుల, చేయూత పింఛన్ దారులతో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దరాశి భగవంతం అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలన్నారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో వికలాంగుల మహాగర్జన సభను విజయవంతం చేసేందుకు ఈనెల 27న జిల్లా కేంద్రంలో వికలాంగుల, చేయూత పింఛన్‌దారుల సభ నిర్వహించనున్నారని, ఈసభలో మందకృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. అన్ని మండలకేంద్రాలనుంచి పెద్దఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో వికలాంగులు గన్నపల్లి లక్ష్మణ్, మండపల్లి రవి ముదిరాజ్, దాసరపు నర్సయ్య, పర్లపల్లి దేవరాజ్, దాచారపు బద్రి, అంతడుపుల పోచయ్య, బూర్ల వేణు, గూగుల్ తిరుపతి, నీలం యాదగిరి, చేయూత పింఛన్‌దారులు వృద్ధులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నిరసన

సిరిసిల్లటౌన్: ఏఐఎస్ఎఫ్ నాయకులపై బీజేపీ, సంఘ్ పరివార్ దాడులను ఖండిస్తూ..ఏఐఎస్ఎఫ్ సిరిసిల్లలో నిరసన కార్యక్రమం చేపట్టింది. అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర రాకేష్, మంద అనిల్‌కుమార్ మాట్లాడుతూ...హైదరాబాద్‌లో ఏఐఎస్ఎఫ్ చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడమే కాకుండా విచక్షణా రాహిత్యంగా తమ నేతలపై దాడులు చేశారన్నారు. దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో పెండెల ఆదిత్య, జామ చెట్టి ఈశ్వర్, మడికంటి శేషాంక్, కొత్తూరి విశ్వసుందర్, నూనె రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

అంతా డిప్యూటేషనే !

- ఖాళీగానే పోస్టులు
- అద్దె భవనాలే దిక్కు



వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయం

వేములవాడరూరల్: ప్రభుత్వ సేవలు గ్రామీణ స్థాయి ప్రజలకు అందుబాటులో ఉండాలని గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లాల నుంచి అదనపు జిల్లాను ఏర్పాటు చేసి అందులో గ్రామాలను కలుపుతూ నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే వేములవాడ రూరల్ మండలాన్ని 2019 జూలై 4న ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఈ మండలంలో సిబ్బంది కొరత ఉంది. కనీసం అటెండర్లు కూడా లేకుండా ఉన్న సిబ్బంది నెట్టుకొస్తున్నారు. ఎంపీడీవో, ఎంపీవోతో పాటు కొంతమంది సిబ్బంది డిప్యూటేషన్‌పై ఈ కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, డ్రైవర్, నలుగురు అటెండర్లు ఉండాల్సిన ఈ కార్యాలయంలో ఖాళీలున్నాయి. ఇందులో వీఆర్‌వోలతోనే డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పర్మినెంట్ అటెండర్ కూడా లేదు. సొంత భవనం కూడా మంజూరుకాకపోవడంతో మండల పరిషత్ ఆవరణలో ఉన్న ఉమ్మడి జెడ్పీ గెస్ట్ హౌజ్‌లోనే మండల పరిషత్ భవనం కొనసాగుతోంది. మండల పరిధిలో 17 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను కలుపుతూ ఆరేళ్లక్రితం ఏర్పాటు చేసిన ఈ రూరల్ మండలానికి ఇప్పటివరకు ముగ్గురు ఎంపీడీవోలు విధులు నిర్వహించారు. ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఈ మండల పరిషత్ పేరుకు మాత్రమే కార్యాలయంగా కొనసాగుతోంది.

తనిఖీ

మండలంలోని లాల్ సింగ్ తండా పరిధిలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో భూక్య లలిత ఇంటిని సోమవారం ఎస్సై లక్ష్మణ్ తన సిబ్బందితో తనిఖీ చేశారు. గుడుంబా తయారీకి ఉపయోగించే ముడి ప దార్థాలను స్వాధీనం చే సుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.